సాక్షి వైఎస్సార్ జిల్లా

ఆదివారం । 10 । నవంబర్ । 2024



రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలు ప్రారంభం
కమలాపురంలోని సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాలలో రాష్ట్ర స్థాయి రగ్బీ స్కూల్ గేమ్స్ క్రీడా పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. -8లో



బాలలే సమాజానికి భవిష్యత్తు
బాలల శ్రేయస్సుపైనే భావి సమాజం ఆధార పడి ఉందని బాలోత్సవ్ కమిటీ అధ్యక్షులు గోపాల్ అన్నారు. బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో పలు పోటీలు నిర్వహించారు. -8లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 33.8/22.4
జిల్లాలో శనివారం 22.4 - 33.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ చైర్మన్‌గా పూల నాగరాజు



కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ చైర్మన్‌గా పూల నాగరాజును నియమించారు. శనివారం కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవుల రెండవ జాబితాను ప్రకటించింది. ఇందులో కడప జోన్ చైర్మన్‌గా రాయదుర్గానికి చెందిన టీడీపీ మాజీ జెడ్పీటీసీ సభ్యుడు నాగరాజుకు వరించింది. ఈ సందర్భంగా ఏపీ పీటీడీ కార్మిక పరిషత్ కడప జోనల్‌కార్యదర్శి పురుషోత్తం ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

చేనేత సొసైటీ అధ్యక్షుడిగా పట్టుపోగుల సుబ్బారావు



వైవీయూ: చేనేత కమ్యూనిటీ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడిగా కడప నగరానికి చెందిన పట్టుపోగుల సుబ్బారావు ఎన్నికయ్యారు. చేనేత కమ్యూనిటీ సొసైటీ సభ్యుల ప్రతినిధులు శనివారం ఈయన్ను ఏకగ్రీవంగా రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పట్టుపోగుల సుబ్బారావు మాట్లాడుతూ చేనేత కమ్యూనిటీని బలోపేతం చేయడంతో పాటు చేనేత వస్త్రాల వినియోగం పెంచేందుకు కృషిచేస్తామని తెలిపారు. ఈయన హ్యాండ్స్ ఫర్ యు స్వచ్ఛంద సేవాసంస్థ ద్వారా రక్తదాన యాక్టివిస్టుగా జిల్లా ప్రజలకు సుపరిచితుడు కావడం విశేషం

14న కడపలో ఎల్ఐసీ కళాజాత



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వివిధ యూనియన్ల నేతలు

కడప కల్చరల్: జీవిత బీమా సంస్థ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 14న సాయంత్రం 5.30 నుంచి రాత్రి 8.00 గంటల వరకు ఆట-పాట మాట (కళాజాత) కార్యక్రమం నిర్వహిస్తున్నామని, దీన్ని జయప్రదం చేయాలని ఎల్ఐసీ సంఘాల నేతలు తెలిపారు. శనివారం కార్యాలయ ఆవరణలో కళాజాత పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం పలువురు నేతలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు అవధానం శ్రీనివాస్ మాట్లాడుతూ బెంగళూరులో యూనియన్ జోనల్ మహాసభ నేపథ్యంలో హైదరాబాదు నుంచి బెంగళూరు వరకు నాలుగు రోజుల పాటు 25 మంది ఎల్ఐసీ సిబ్బందితో కూడిన కళాకారుల బృందం ప్రదర్శనకు వెళుతుందన్నారు. ఇందులో భాగంగా ఆ బృందం నవంబర్ 14న కడపకు చేరుకుని కళారూపాల ప్రదర్శన ఇస్తుందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు ఎల్ఐసీ బలంగా ఉండడం అవసరమని, ప్రభుత్వ రంగ సంస్థలే దేశ భవిష్యత్తుకు ప్రాణాధారమన్న చైతన్యాన్ని పెంచడం ఈ కళాజాత ఉద్దేశమని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల యూనియన్ నేతలు అక్బర్, అమీనా పర్వీన్, శ్రీనివాసులు, శ్రీనివాసులురెడ్డి, మనోహర్, రాజామణి, రామకృష్ణారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, కుమారస్వామి, లక్ష్మీరాజా, మహేష్, గునిశెట్టి పాల్గొన్నారు.

వాసుకు చెంప పెట్టు!

- టీడీపీ'ట్రిక్స్'కు మేయర్ సురేష్‌బాబు చెక్
- టీడీపీ నేతల ఆరోపణలపై దేవునికడపలో ప్రమాణం
- కిమ్మనకుండా ఉండిపోయిన వాసు అండ్ కో



దేవునికడప ఆలయంలో ప్రమాణం చేస్తున్న మేయర్ సురేష్‌బాబు. ఫొటోలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా తదితరులు



సాక్షి ప్రతినిధి, కడప: తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసుల రెడ్డి నోటిదురుసుకు చెంప పగిలే సమాధానం వచ్చింది. అధికారమత్తులో ఎదుటివాళ్ల వ్యక్తిత్వాన్ని దిగజారుస్తూ చేసిన తలబిరుసు ఆరోపణలకు దిమ్మ తిరిగే జవాబు ఎదురైంది. గత ఎన్నికల్లో టీడీపీకి అమ్ముడుపోయారని కడప నగర మేయర్ సురేష్‌బాబుపై వాసు తీవ్ర ఆరోపణలు చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో మేయర్ సురేష్ బాబు శనివారం దేవుని కడప శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రమాణం చేశారు. వాసు చేసిన అసత్య ఆరోపణలను తిప్పి కొట్టారు. సమాధానం చెప్పాల్సిన జిల్లా తెలుగు దేశం పార్టీ ముఖం చాటేసింది.

- నిర్దిష్టమైన ఆరోపణలు సంధిస్తూ విపక్ష నేతల్ని ఇరుకున పెట్టడం ఉత్తముల లక్షణం. బురద జల్లుతాం, కడుక్కుంటూ వెళ్లండి అన్న ధోరణి అనైతికం. జిల్లా టీడీపీ అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి రెండో కోవలోకి వస్తున్నారు. అధికారం ఉంది.. ఏం మాట్లాడినా చలామణి అవుతుందనుకుంటే.. తగిన సమయంలో ఎదురొచ్చే తీర్పు భయంకరంగా ఉంటుంది. చరిత్ర సైతం అదే రుజువు చేస్తోంది. బాధ్యత, స్థాయి మర్చి వ్యవహరిస్తే తగిన మూల్యం చెల్లించేరోజు రానే వస్తుంది. ప్రస్తుతం టీడీపీ జిల్లా అధ్యక్షుడు వాసుకు ఇదే పరిస్థితి ఎదురైంది. తాను చెప్పిన మాటలను సైతం అనలేదంటూ యూటర్న్ తీసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.
- జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి అండ్‌కో

మేయర్ సురేష్‌బాబుపై ఏదో ఒక ప్రకటనలో ఆరోపణలు చేసింది కాదు బాహాటంగా నినాదాలు చేశారు. వాసు అనుంగు శిష్యుడు మాజీ గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు రామప్రసాదరెడ్డి స్వయంగా నినాదాలు చేశారు. అందుకు వంతపాడుతూ శ్రీనివాసులరెడ్డి వ్యవహరించారు. ఆ ఆరోపణలు నేపథ్యంలో తన సచ్ఛీలత నిరూపించుకునే క్రమంలో మేయర్ సురేష్‌బాబు దేవుని ఎదుట ప్రమాణం చేశారు. మరి నిజంగా ఆ ఆరోపణలకు కట్టుబడి ఉంటే జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి అండ్‌కో స్పందించాలి. యస్...ఇవిగో రుజువులంటూ ముందుకు రావాలి కదా? తోకముడుస్తున్నారంటే తప్పుడు ఆరోపణలు చేసినట్టే కదా? అంత దానికి ఈ డొంకతిరుగుడు వ్యవహారాలెందుకని విశ్లేషకులు నిలదీస్తున్నారు.

క్షమాపణలు కోరాల్సిందిగా డిమాండ్..
మేయర్ సురేష్‌బాబుపై అనుచిత ఆరోపణల నేపథ్యంలో దేవుని సన్నిధిలో ప్రమాణం చేశారు. మేయర్ చర్య కారణంగా టీడీపీ పరువు గంగలో కలిసిపోయింది. ఆరోపణలు చేసిన జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి అండ్‌కో క్షమాపణలు కోరి పార్టీ పరువు నిలపాల్సిందిగా తెలుగుతమ్ముళ్లు సూచిస్తున్నారు. నాలుగు దశాబ్దాలుగా తెలుగుదేశం పార్టీలో ఉన్నాం. అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఇంతటి అధ్వానంగా ఎప్పుడు ప్రవర్తించింది లేదని ఆ పార్టీ సీనియర్ నాయకుడొకరు వాపోయారు. ప్రజలు టీడీపీపై నమ్మకంతో కడప ఎమ్మెల్యే సీటు సుదీర్ఘకాలం తర్వాత అప్పగించారు. ఆ గౌరవాన్ని నిలుపుకునే స్థితిలో తమ పార్టీ లేదని ఆ నాయకుడు వ్యాఖ్యానించడం గమనార్హం.

హుందాతనం కోల్పోయి...

జిల్లా కేంద్రమైన కడప అసెంబ్లీ స్థానంలో టీడీపీ ఇరవై ఏళ్ల తర్వాత విజయం సాధించింది. అధికారిక హోదా వచ్చిందే తడవుగా హుందాతనం కోల్పోయారనే ఆరోపణలు అనతికాలంలోనే తెరపైకి వచ్చాయి. ఎంతో అభిమానంతో ప్రజలు అప్పగించిన పదవిని అడ్డుపెట్టుకుని ఇష్టారాజ్యంగా ప్రవర్తించడం భావ్యమేనా? గౌరవం నిలుపుకోవాల్సిన పనిలేదా? హోదా వస్తే ఎలా పడితే అలా వ్యవహరిస్తారా? ఇవన్నీ గడిచిన ఐదునెలలుగా కడపలో విన్పిస్తున్న మాటలు. ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించడం లేదని అనేక ఘటనలు సైతం రుజువు చేస్తున్నాయి. ఎప్పుడు లేనిది విపక్ష నేతలకు చెందిన వ్యాపారాలకు సైతం గండికొట్టారు. కడప నడిబొడ్డులో ఉన్న రెండు బార్ అండ్ రెస్టారెంట్లను పచ్చ నేతలు లాక్కున్నారు. ఈ వ్యవహారం ప్రత్యక్షంగా, పరోక్షంగా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి కనుసన్నల్లో నడిచింది. మొన్న ఏకంగా టీడీపీ నగర అధ్యక్షుడు సానపురెడ్డి శివకొండారెడ్డిపై హత్యాయత్నం ఘటన జరిగింది. టీడీపీ వారితోనే తనకు ముప్పు ఉందని, ఎప్పుడు లేని విషసంస్కృతి నడుస్తోందని స్వయంగా టీడీపీ నగర అధ్యక్షుడు వాపోయారు. ఇలాంటి వ్యవహారాలన్నింటిపై జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి వైపే అందరి వేళ్లు చూపిస్తున్నాయి.

ఆరోపణలు కాదు.. ప్రమాణం చెయ్



మీడియాతో మాట్లాడుతున్న మేయర్ సురేష్‌బాబు. చిత్రంలో రవీంద్రనాథ్‌రెడ్డి, అంజద్‌బాషా, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

- రూ.3కోట్లకు అమ్ముడుపోయానని రుజువు చేస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటా
- టీడీపీ నేత శ్రీనివాసులరెడ్డికి మేయర్ సురేష్ బాబు సవాల్
- తాను ఏ తప్పూ చేయలేదని దేవునికడపలో ప్రమాణం చేసిన మేయర్

కడప కార్పొరేషన్: తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డి తనపై చేసిన ఆరోపణలు నిజమైతే ఆయన కూడా దేవుని మీద ప్రమాణం చేయాలని మేయర్ సురేష్ బాబు సవాల్ విసిరారు. శనివారం తిరుమల తొలిగడప దేవునికడప ఆలయంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాలతో కలిసి శ్రీవెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 2024 ఎన్నికల్లో తాను ఎలాంటి తప్పు చేయలేదని ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కడప ఎమ్మెల్యే మాధవి, ఆమె భర్త శ్రీనివాసుల రెడ్డి ప్రశాంతంగా ఉన్న నగరంలో కక్షలు, కార్పణ్యాలు రేపి ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారన్నారు. ముప్పై ఏళ్లకు పైగా తాను రాజకీయాల్లో ఉన్నానని, వైఎస్ కుటుంబాన్ని నమ్ముకొని విలువలతో కూడిన రాజకీయాలు చేస్తున్నానన్నారు. శ్రీనివాసులరెడ్డి ఏ ఎండకు ఆ గొడుగు పట్టే రకమని ధ్వజమెత్తారు. తాను గత ఎన్నికల్లో రూ.3కోట్లు డబ్బు తీసుకొని టీడీపీకి సహకరించానని కొంతమంది నీచులతో ఆరోపణలు చేయించడం నీతిమాలిన చర్య అన్నారు. ఈ నిందారోపణలను రుజువు చేస్తే రాజకీయ సన్యాసం చేస్తానని పునరుద్ఘాటించారు. తాను ప్రమాణం చేస్తానని ప్రకటించగానే శ్రీనివాసుల రెడ్డి తోక ముడిచి యూ టర్న్ తీసుకున్నారని, తాను అలా అనలేదని మాట మార్చారన్నారు. ఇలా రెండు నాల్కల ధోరణి వారి పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు నుంచి వారికి అలవడిందని ఎద్దేవా చేశారు.

కడపలో ఇలాంటి సంస్కృతి ఎప్పుడూ లేదు: పి. రవీంద్రనాథ్‌రెడ్డి
కడపలో ఇలాంటి నీచ సంస్కృతి ఎప్పుడూ లేదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. రాజకీయాల్లో ఉన్నవారు విలువలు పాటించాలని, నిందారోపణలు చేయడం, వ్యక్తిత్వ హననానికి పాల్పడడం సరికాదన్నారు. నోటికొచ్చినట్లు మాట్లాడి, ఆ తర్వాత యూటర్న్ తీసుకోవడం మంచి సాంప్రదాయం కాదన్నారు.

ప్రమాణం చేయాలి లేదా బహిరంగ క్షమాపణ చెప్పాలి: మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా
టీడీపీ నేత శ్రీనివాసులరెడ్డి మేయర్‌పై చేసిన ఆరోపణలు నిజమని ప్రమాణం చేయాలని లేదా తప్పుగా మాట్లాడానని బహిరంగ క్షమా పణ చెప్పాలని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అన్నారు. అవసరానికి ఒక మాట, ఆ తర్వాత ఇంకో మాట చెప్పడం వాసుకే చెల్లునన్నారు.

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ పార్టీలు అధికారంలోకి వస్తుంటాయి, పోతుంటాయి...రాజకీయాల్లో ఉన్న వారు విలువలు పాటించి జాగ్రత్తగా మాట్లాడాలని హితవు పలికారు. వైఎస్సార్‌సీపీ నేతలు జయచంద్రారెడ్డి, యానాదయ్య, పులి సునీల్ కుమార్, బంగారు నాగయ్య, సీహెచ్ వినోద్, రామ్మోహన్‌రెడ్డి, రాణాప్రతాప్ పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

అసభ్యకర పోస్టులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి

డీఎస్పీకి వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి వినతి



కడపలో డీఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై, వారి కుటుంబ సభ్యులపై సోషల్ మీడియా వేదికగా అసభ్యకర పోస్టులు పెడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి కోరారు. శనివారం మేయర్ సురేష్‌బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాతో కలిసి ఆయన డీఎస్పీ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ కొందరు టీడీపీ నాయకులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై సోషల్ మీడియా వేదికలైన వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రాగామ్‌లలో అనుచిత వ్యాఖ్యలు చేస్తూ.. ఫొటోలు మార్ఫింగ్ చేసి దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. తద్వారా వారి పరువు ప్రతిష్టలకు భంగం కలిగిస్తున్నారని, సమాజంలో ఆరోగ్యకర వాతావరణాన్ని చెడగొడుతున్నారన్నారు. ఫేక్ ఐడీలతో చనిపోయిన వారిని కూడా వదలకుండా వ్యక్తిత్వ హననానికి పాల్పడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయలేక.. వైఎస్సార్‌సీపీ నేతలపై అసత్య ప్రచారాలకు దిగుతోందన్నారు. సభ్య సమాజం తలదించుకునేలా పోస్టులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో పోలీసులకు వినతి పత్రాలు ఇస్తున్నామని తెలిపారు. పోలీసులు చర్యలు తీసుకోకపోతే న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు పులి సునీల్ కుమార్, తోటక్రిష్ణ, త్యాగరాజు, కె.బాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచే ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ



పరుగు పందెం నిర్వహించే మైదానం



వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన అభ్యర్థులు

కడప నగరంలోని డీఎస్ఏ క్రీడామైదానం వేదికగా రాష్ట్రంలోని 13 జిల్లాలకు చెందిన అగ్నివీర్ అభ్యర్థులు పాల్గొనే ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి సర్వం సిద్ధమైంది. ఆదివారం నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ ర్యాలీలో 4వేల మంది అభ్యర్థులు పాల్గొననున్నారు. వీరందరికీ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా అధికార యంత్రాంగం, ఆర్మీ రిక్రూట్‌మెంట్ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అభ్యర్థులకు నిర్వహించే ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్షలు, మెడికల్ టెస్ట్‌ల నిర్వహణకు విభాగాల వారీగా ఏర్పాట్లు చేశారు. రిక్రూట్‌మెంట్ డైరెక్టర్ కల్నల్ పునీత్‌కుమార్ ఆధ్వర్యంలో ఇప్పటికే ఆర్మీ సిబ్బంది పనులు పూర్తి చేశారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, తోపులాటలు లేకుండా భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. -కడప స్పోర్ట్స్

ఉత్తమ గురువులకు పురస్కారాలు

- వైవీయూ నుంచి నలుగురు ఎంపిక
- డిగ్రీ కళాశాలల నుంచి.. పాఠశాల విద్య నుంచి మరికొందరు...

వైవీయూ: జిల్లాకు చెందిన అధ్యాపకులు, ఉపాధ్యాయలుకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు వరించాయి. వైవీయూ నుంచి నలుగురికి ఈ పురస్కారాలు వరించగా, కడప ఆర్ట్స్ కళాశాల నుంచి ఇద్దరు, కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల నుంచి ఒకరికి ఈ పురస్కారం దక్కింది. వీరికి ఈనెల 11న మంగళగిరిలో నిర్వహించే జాతీయ విద్యాదినోత్సవంలో పురస్కారాలు ప్రదానం చేయనున్నారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు లభించడంపై వైవీయూ వీసీ కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ పద్మ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్, ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సలీంబాషా అభినందనలు తెలిపారు.

ఆచార్య జి. విజయభారతి..



యోగివేమన విశ్వవిద్యాలయంలో కామర్స్ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆచార్య జి. విజయభారతికి కామర్స్ విభాగంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ప్రభుత్వం ఎంపిక చేసింది. 2007లో వైవీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరిన ఈమె 2022లో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. 28పైగా ఈమె రాసిన పబ్లికేషన్స్ జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి.2019లో సీనియర్ ఉమన్ ఎడ్యుకేటర్ అండ్ స్కాలర్ అవార్డును నేషనల్ ఫౌండేషన్ ఫార్ ఎంటర్‌ప్రెన్యూర్ డెవలప్‌మెంట్ సంస్థ నుంచి పొందారు.

ఆచార్య ఎల్.వీరాంజనేయరెడ్డి



వైవీయూలో మైక్రోబయాలజీ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఎల్. వీరాంజనేయరెడ్డి సైన్సెస్ విభాగంలో ఈ పురస్కారం వరించింది. ప్రస్తుతం ఈయన వైవీయూ ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సీసీఎంబీ హైదరాబాద్‌లో పోస్ట్ డాక్టరల్ ఫెలో పూర్తి చేసిన ఈయన సౌత్‌కొరియాలో పోస్ట్ డాక్టరల్ రీసెర్చర్‌గా పనిచేశారు. కాగా ఈయన ఇదివరకే పలు అవార్డులతో పాటు 2019లో అంతర్జాతీయ రీసెర్చ్ ఫెలో అవార్డును కొరియా నుంచి అందుకున్నారు. 95 అంతర్జాతీయ పబ్లికేషన్స్, 5 నేషనల్ పబ్లికేషన్స్ ఉన్నాయి. ఈయనకు రెండు పేటెంట్లు ఉన్నాయి.

డాక్టర్ జి. విజయలక్ష్మి..




కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆర్థికశాస్త్ర అధ్యాపకులుగా పనిచేస్తున్న డాక్టర్ జి. విజయలక్ష్మి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపికైంది. కాగా ఈమె గతంలో రాష్ట్రస్థాయిలో ఎన్ఎస్ఎస్ ఉత్తమ ప్రోగ్రాం ఆఫీసర్‌గా అవార్డు అందుకున్నారు. 1977లో స్లెట్ ఉత్తీర్ణత సాధించి 2008లో ఏపీపీఎస్‌సీ ద్వారా జూనియర్ కళాశాల అధ్యాపకురాలిగా విధుల్లో చేరారు. 2013లో పదోన్నతి పొంది ప్రస్తుతం కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్నారు.

డాక్టర్ సయ్యద్ వసివుల్లా బక్తియారి




కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో ఉర్దూ విభాగంలో అధ్యాపకుడుగా పనిచేస్తున్న డాక్టర్ వసివుల్లా బక్తియారికి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం లభించింది. ఉర్దూ విభాగాధిపతిగా పనిచేస్తున్న ఈయన ఉర్దూలో వందలాది రచనలు, కవిత్వాలు, గజల్స్, హమ్ద్, నాత్‌లు రాశారు. 10కిపైగా పుస్తకాలు ప్రచురితమై దేశవ్యాప్తంగా మన్ననలు పొందాయి. ఉర్దూ సెమినార్‌లు, సదస్సులు నిర్వహిస్తూ ఉర్దూ భాషాభివృద్ధికి ఈయన కృషిచేస్తున్నారు. కాగా సాహితీ రచనలతో పాటు పలు అవార్డులు, రివార్డులను ఈయన అందుకున్నారు.

లెఫ్టినెంట్ డాక్టర్ ఆర్.నీలయ్య



కడప ప్రభుత్వ పురుషుల కళాశాలలో కామర్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఆర్. నీలయ్యకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం లభించింది. ఈయన పలు కళాశాలలకు బీఓఎస్ మెంబర్‌గాను, అకడమిక్ కౌన్సిలర్‌గా, ఎంకాం కోర్సు కో-ఆర్డినేటర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 2008లో ఐసీఎస్ఎస్ఆర్ నుంచి డాక్టరల్ ఫెలోషిప్ అందుకున్నారు. 2016లో ఎన్‌సీసీలో లెఫ్టినెంట్ ర్యాంకును పొందారు.

ఆచార్య ఎం. అనిత




వైవీయూలో ఆర్థికశాస్త్ర విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆచార్య ఎం. అనిత రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపికయ్యారు. వైవీయూలో ఎకనామిక్స్ విభాగం కోఆర్డినేటర్‌గా, విభాగాధిపతిగా, ఐక్యూఏసీ మెంబర్‌గా, బీఓఎస్ చైర్మన్‌గా, ఎన్ఎస్ఎస్ పీఓగా ఈమె బాధ్యతలు నిర్వహించారు. రూసా ప్రాజెక్టులను ఈమె పూర్తి చేశారు. ఈమె రాసిన పలు పబ్లికేషన్స్ 30కిపైగా జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి.

డాక్టర్ ఖాజాపీర్



యోగివేమన యూనివర్సిటీలో డిపార్టుమెంట్ ఉర్దూ విభాగంలో అకడమిక్ కన్సల్టెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ ఎస్. ఖాజీపీర్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఈయన ఏపీసెట్(2017) ఆంధ్రయూనివర్సిటీ ద్వారా పిహెచ్‌డికి ఎంపికై తిరుపతి యస్వీ యూనివర్సిటీలో పిహెచ్‌డీ పూర్తి చేశారు. ఆ తరువాత 2017 సెప్టెంబర్‌లో వైవీయూలోని డిపార్టుమెంట్ ఆఫ్ ఉర్దూ విభాగంలో అకడమిక్ కన్సల్టెంట్‌గా విధుల్లో చేశారు. ఈయన ఇంటర్నేషనల్ సెమినార్, వెబినార్ 10, నేషనల్ సెమినార్స్ వెబినార్ 40, నేషనల్ కాన్ఫరెన్స్ 10, రాష్ట్ర సెమినార్, వెబినార్ 8 నిర్వహించారు. అలాగే 12 జాతీయ ముషాయిరాలు, 25 రాష్ట్ర ముషాయి రాలలో పాల్గొన్నారు. అలాగే బుక్ చాప్టర్స్ 12, నేషనల్ మ్యాగజెన్స్ 8ని రచించారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎస్.కొండారెడ్డి ఎంపిక



ప్రొద్దుటూరులోని డీబీసీఎస్ మున్సిపల్ హైస్కూల్ జీవ శాస్త్ర ఉపాధ్యాయుడు శ్రీయపురెడ్డి కొండారెడ్డి 1995లో మోడంపల్లె మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో విధులు చేపట్టారు. ఆపై పలు చోట్ల పనిచేశారు. ఆయా సైన్స్‌ఫేర్‌లో ఈయన ఆధ్వర్యంలో పాల్గొన్న విద్యార్థులు 18సార్లు రాష్ట్రస్థాయి, 3 సార్లు జాతీయ స్థాయిలో తమ ప్రతిభ చాటారు. ఈయనకు 2016లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఈయన భార్య శివతులశమ్మ రామేశ్వరం మున్సిపల్ హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు.

కళాశాల విద్య నుంచి..

కడప ఎడ్యుకేషన్: జిల్లాకు సంబంధించి పాఠశాల విద్యలో ఇద్దరికి, ఇంటర్ విద్యలో ఒకరికి, టెక్నికల్ విద్యలో మరొకరికి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు వరించాయి.

పి. వెంకట క్రిష్ణయ్య, లెక్చరర్



పి. వెంకటసుబ్బయ్య 2012లో ఏపీపీఎస్సీ ద్వారా లెక్చరర్‌గా (బాటనీ సబ్జెక్టు) ఎంపికై తొలుత కర్నూల్ జిల్లా సంజామాల జూనియర్ కళాశాలలో విధుల్లో చేరాడు. ప్రస్తుతం జమ్మలమడుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పని చేస్తున్నారు. డిజిటల్ ప్రొజెక్టర్ ద్వారా పిల్లలకు బోధన చేస్తున్నారు. పిల్లలకు ఉచిత ఎంసెట్ కోచింగ్ ఇవ్వడంతోపాటు అధ్యాపకులకు రీసోర్సు పర్సన్‌గా ఓరియంటేషన్ తరగతులను నిర్వహిస్తున్నారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల లెక్చరర్ మహేష్



ప్రొద్దుటూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ లెక్చరర్‌గా పనిచేస్తున్న ఎం.మహేష్ 2012లో ఏపీపీఎస్సీ ద్వారా లెక్చరర్‌గా ఎంపికయ్యారు. ప్రస్తుతం ఆయన ప్రొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పనిచేస్తున్నారు. విద్యలో వెనుకబడిన పిల్లలపట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని స్పెషల్ తరగతులను నిర్వహించి వారి విద్యాభివద్ధికి కృషి చేస్తున్నారు. పాఠ్యపుస్తకాల రచయితగా కూడా పనిచేస్తున్నారు.

క్లుప్తంగా

కొండచిలువ కలకలం



రాజుపాళెం : రాజుపాళెం మండలం అర్కటవేములలో శనివారం సాయంత్రం కొండచిలువ కలకలం రేపింది. గ్రామంలోని సోంబావి వద్ద ఉన్న కంప చెట్లలో కొండ చిలువ కనిపించడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. అది అక్కడే ఉన్న కోడిని తిని ఎక్కడికీ పోకుండా చుట్టుకుంది. దాన్ని చూసేందుకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. వారు అటవీ శాఖ అధికారులకు సమాచారం తెలిపినా ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

చీనీ చెట్ల నరికివేత



ముద్దనూరు : మండలంలోని మంగపట్నం గ్రామంలో బోడెద్దుల బయపురెడ్డి అనే వ్యక్తికి చెందిన 48 చీనీ చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేసినట్లు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. సీఐ దస్తగిరి సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బయపురెడ్డి గ్రామంలో 4.92 ఎకరాలలో చీనీ చెట్లు సాగు చేస్తున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు 48 చెట్లను నరికివేశారు. శనివారం ఉదయం తోట వద్దకు ఆయన వెళ్లి చూడగా చెట్లను నరికి వేసినట్లు గుర్తించి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

వేంపల్లె : వేంపల్లె పట్టణంలోని చింతలమడుగుపల్లె గ్రామ సమీపంలో ఉన్న జగనన్న కాలనీ వద్ద కదిరి టౌన్‌కు చెందిన షేక్ అక్రమ్ బాషా, సలీం బాషా శనివారం రేషన్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తుండగా పట్టుకుని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 12 బస్తాల రేషన్ బియ్యం, టాటా సుమో, ఆటో స్వాధీనపరుచుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రంగారావు తెలిపారు.

మొండిచేయి!



భూపేష్‌రెడ్డి



లింగారెడ్డి



ప్రవీణ్‌కుమార్‌రెడ్డి



రితేష్‌రెడ్డి

- జిల్లా టీడీపీ నేతలకు దక్కని నామినేటెడ్ పోస్టులు
- నాడు భరోసా ఇచ్చిన అధిష్టానం పదవుల భర్తీలో రిక్తహస్తం
- భూపేష్, ప్రవీణ్, రితేష్, బత్యాల, లింగారెడ్డి ఆశలు అడియాశలు

సాక్షి ప్రతినిధి, కడప : నామినేటెడ్ పదవుల భర్తీలో జిల్లాకు మొండిచేయి మిగిలింది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు గంగలో కలిశాయి. జిల్లాలోని టీడీపీ నాయకుల మీద అధిష్టానానికి నమ్మకం సన్నగిల్లినట్లు తెలుస్తోంది. పరిశీలనలో కూడా జిల్లా నేతల పేర్లు విన్పించలేదు. రాష్ట్ర వ్యాప్తంగా 59 చైర్మన్‌గిరి పదవులు ప్రకటిస్తే.. జిల్లాకు ఒక్కటంటే ఒక్కరికి కూడా దక్కలేదు. జిల్లాకు చెందిన నేతలు పల్లకీ మోసే బోయిలుగానే ఉండిపోవాల్సిన దుస్థితి ప్రస్ఫుటమైంది.

టికెట్లు సైతం త్యాగం చేసినా..

తెలుగుదేశం పార్టీ సీనియార్టీని గుర్తిస్తుందన్నది భ్రమగా మిగులుతోంది. ఆవిర్భావం నుంచి అంటిపెట్టుకుని ఉన్న నాయకులకు గుర్తింపు లేదు. కష్టకాలంలో శ్రమకోర్చి పార్టీకి అండగా నిల్చిన నేతలకు అవకాశం లేదు. టికెట్లు సైతం త్యాగం చేసిన వారికి ప్రాధాన్యత లభించలేదు. రాజ్యసభ పదవుల భర్తీలో తూకం ఆధారంగా పదవులు పంపిణీ చేసే టీడీపీ ఈమారు నామినేటెడ్ పోస్టుల భర్తీలో కూడా.. అదే పంథా ఎంచుకున్నట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి.

నమ్ముకున్న వారికి రిక్తహస్తం

ఎమ్మెల్యే కోల్పోయిన భూపేష్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డిలకు నామినేటెడ్ పోస్టుల భర్తీలో అవకాశం లభిస్తుందని పలువురు చెప్పుకొచ్చారు. ఆ మేరకు చినబాబు లోకేష్ సైతం అభయమిచ్చారని ప్రచారంలోకి వచ్చింది. పైగా ఇరువురు అయా నియోజకవర్గాల్లో టీడీపీ బలోపేతానికి విశేషంగా పని చేశారు. ఎవ్వరూ లేని సమయంలో ఆ పార్టీ మనుగడకు కృషి చేశారు. తీరా పదవుల ప్రకటన జాబితాలో వారి పేర్లు లేవు. అలాగే పార్టీ జిల్లా అధ్యక్షుడిగా పని చేసిన లింగారెడ్డి, బద్వేలు బాధ్యుడు రితేష్‌రెడ్డి కూడా నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. ఇలాంటి వారందరికీ టీడీపీ అధిష్టానం రిక్తహస్తం చూపెట్టింది.

అన్నమయ్య జిల్లాకు అవకాశం

అన్నమయ్య జిల్లాకు చెందిన ముక్కా రూపానందరెడ్డికి అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ పదవి లభించింది. ఇది వరకూ కేబినెట్ కూర్పులో కూడా రాయచోటి ఎమ్మెల్యే మండిపల్లి రాంప్రసాదరెడ్డికి అవకాశం దక్కింది. నామినేటెడ్ పోస్టుల భర్తీలో కూడా అదే జిల్లాకు చెందిన రూపానందరెడ్డికి జనసేన కూటమిలో భాగంగా అవకాశం కల్పించారు. మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్‌రాయుడు, మాజీ ఎమ్మెల్యేలు శంకర్‌యాదవ్, ద్వారకనాథరెడ్డి అసెంబ్లీ టికెట్లు త్యాగం చేశారు. నామినేటెడ్ పోస్టుల భర్తీలో ఛాన్సు ఉంటుందని భావించారు. తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాం చినబాబు పదవి వరిస్తుందని ప్రచారం కూడా చేసుకున్నారు. ఇలా పలువురు నాయకులు పెట్టుకున్న ఆశలు అడియాశలుగా మారాయి.

మాయమాటలతో మోసం

వృద్ధురాలి తాళిబొట్టు సరుడు ఎత్తుకెళ్లిన దుండగులు



బాధితురాలు రామలక్షుమ్మ

గోపవరం : ఓ వృద్ధురాలికి మాయమాటలు చెప్పి ఆమె మెడలో ఉన్న తాళిబొట్టు సరుడును దుండగులు ఎత్తుకెళ్లారు. గోపవరం మండలంలోని చిన్న గోపవరం గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. శనివారం ఉదయం 25 నుంచి 30 ఏళ్లలోపు వయసు ఉన్న ఇద్దరు యువకులు బైక్ మీద చిన్న గోపవరం గ్రామంలోని కలువాయి రామలక్షుమ్మ ఇంటి వద్దకు వచ్చారు. పెన్షన్ వస్తుందా, ఉచిత సిలిండర్లు ఇస్తున్నారా అని ఆమెను అడిగారు. తన భర్తకు పింఛన్ వస్తుందని, తనకు రావడం లేదని చెప్పింది. నీకు కూడా పెన్షన్ వచ్చేలా చేస్తామని, అందుకోసం నీ ఆధార్‌కార్డు అప్‌డేట్ చేయాల్సి ఉందని నమ్మబలికారు. ఆ వృద్ధురాలు ఇంట్లో ఉన్న ఆధార్ కార్డు తీసుకుని వారి వద్దకు వచ్చింది. ఫొటో తీయాలని, మెడలో సరుడు ఉంటే సరిగా రాదని, సరుడు తీసి పక్కన పెట్టాలని చెప్పడంతో ఆమె పక్కనే ఉన్న టీవీపై పెట్టింది. ఇంతలో ఆధార్‌కార్డు అందించే క్రమంలో ఒక్కసారిగా టీవీపై ఉన్న తాళిబొట్టు సరుడును దుండగులు తీసుకుని బైక్‌పై ఉడాయించారు. తాళిబొట్టు సరుడు నాలుగు తులాలు ఉంటుందని, సుమారు రూ.3.50 లక్షలు విలువ ఉంటుందని వృద్ధురాలి తెలిపింది. ఉన్నపలంగా మెడలో ఉన్న తాళిబొట్టు సరుడును దుండగులు ఎత్తుకెళ్లడంతో మోసపోయానని ఆమె భర్తకు, చుట్టుపక్కల ఉన్న వారికి తెలియజేసింది. వారు వెంటనే బద్వేలు రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. రూరల్ సీఐ నాగభూషణం, ఎస్ఐ శ్రీకాంత్‌లు గ్రామానికి చేరుకుని విచారణ చేసి, దుండగుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కాగా బైక్‌లో వచ్చిన ఇద్దరు యువకులు ముందుగా పెద్ద గోపవరంలో ఓ వృద్ధురాలికి ఇదే మాయమాటలు చెప్పి అక్కడ ఆమెకు ఆధార్ అప్‌డేట్ కోసం ఫొటో తీశారు. అయితే ఆ సమయంలో ఆ వృద్ధురాలి తన మెడలో ఉన్న బంగారాన్ని ఆమె చేతపట్టుకుని వారికి చుక్కలు చూపించింది. వారు అనుకున్న పని అక్కడ కాకపోవడంతో రామలక్షుమ్మ అనే వృద్ధురాలు వారి చేతిలో మోసపోయింది.

లింగమూర్తి మృతి తీరని లోటు



కమ్యూనిస్టు నేత లింగమూర్తి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పి.రవీంద్రనాథ్‌రెడ్డి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కమ్యూనిస్టు సీనియర్ నాయకుడు లింగమూర్తి మృతి ఆ పార్టీకి, సమాజానికి తీరని లోటు అని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, వైఎస్‌ఆర్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. నగర శివారు ఊటుకూరు సమీపంలోని సాయి నగర్‌లో ఉన్న లింగమూర్తి స్వగృహానికి వారు శనివారం వెళ్లి ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ అత్యంత ధనవంతుల కుటుంబంలో పుట్టి, ఎంతో చరిత్ర ఉన్న విజయవాడ లయోలా కాలేజీలో చదువుకొని 60 ఏళ్లపాటు కమ్యూనిస్టు ఉద్యమానికి అంకితమయ్యారని పేర్కొన్నారు. పేదలు, కార్మికుల కోసం చివరి శ్వాస వరకు అలుపెరగని పోరాటాలు నిర్వహించిన లింగమూర్తి ప్రస్తుత, భవిష్యత్తు తరాల వారికి ఎందరికో ఆదర్శప్రాయుడని పేర్కొన్నారు. అలాగే లింగమూర్తి మృతదేహాన్ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు తులసిరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి సందర్శించి, నివాళులర్పించారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మన్ పులి సునీల్, షఫీ, కమ్యూనిస్టు, వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాసుందర్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్ : ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఇవ్వాల్సిన రూ.21 వేల కోట్ల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాసుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం కడపలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు అయినా సరెండరు లీవు, ఏపీజీఎల్ఐ బకాయిలు చెల్లించలేదన్నారు. పీఎఫ్ రుణాలు వెంటనే చెల్లించాలన్నారు. పీఆర్సీ అమలులో జాప్యం జరుగుతోందని, ఇందుకు ప్రత్యామ్నాయంగా 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. 12వ పీఆర్సీ అమలు కోసం కమిషనర్‌ను నియమించాలన్నారు. 2018 నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు రావాల్సిన కరువు భత్యం బకాయిలు చెల్లించాలన్నారు. సీపీఎస్ ఉద్యోగులకు, పెన్షనర్లకు కరువు భత్యం బకాయిలతోపాటు 11వ పీఆర్సీ బకాయిలను నగదు రూపంలో చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాదర్ బాషా, శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్లు భాస్కర్‌రెడ్డి, సి.కె.శ్రీనివాసరెడ్డి, సురేంద్రనాథరెడ్డి, జిల్లా కార్యదర్శులు రాంభూపాల్‌రెడ్డి, అబ్దుల్ సత్తార్, సుబ్బయ్య, క్రిష్టారెడ్డి, ఆదిశేషారెడ్డి, రామచంద్రారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని టీచర్ కొట్టాడని ఫిర్యాదు

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని ఒక ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న అస్విన్ అనే విద్యార్థిని కొట్టి బెదిరించిన అస్లాం అనే ఉపాధ్యాయుడిపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. 9వ తరగతి చదువుతున్న అస్విన్, మరో విద్యార్థి గొడవ పడుతున్నారని ఉపాధ్యాయుడు అస్లాం వారిని దండించాడు. దీన్ని విద్యార్థి అస్విన్ ప్రశ్నించడంతో ఉపాధ్యాయుడు అతన్ని మందలించడంతోపాటు అట్టతో కొట్టాడు. విషయం తెలియడంతో బాలుడి తల్లి పాఠశాల వద్దకు వచ్చింది. బాలుడ్ని వెంట తీసుకొని టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లింది. జరిగిన సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ విషయమై సీఐ యుగంధర్‌ను వివరణ కోరగా.. ఈ సంఘటనపై కేసు నమోదు చేయలేదన్నారు. బాలుడు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించామని చెప్పారు. జరిగిన విషయాన్ని కరస్పాండెంట్‌కు చెప్పడానికి విజయనగరం వీధిలోకి వెళ్లినప్పుడు.. తనపై బాలుడి పెద్దనాన్న బబ్లూ దాడి చేశాడని ఉపాధ్యాయుడు అస్లాం శుక్రవారం రాత్రి ఫిర్యాదు చేయడంతో వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

మనస్పర్థలతోనే విద్యార్థినుల ఆత్మహత్యాయత్నం!

- ఎస్సీ బాలికల వసతి గృహంలో ఘటన
- చికిత్స పొందుతున్న బాలికలు

జమ్మలమడుగు : పట్టణంలోని నాగులకట్టలో ఉన్న ఎస్సీ బాలికల వసతి గృహంలో ఇద్దరు విద్యార్థినుల ఆత్మహత్యాయత్నం తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సంఘటన చోటు చేసుకుంది. విద్యార్థినులు డిగ్రీ కావడంతో వారిపై అజమాయిషీ చేయడానికి సైతం వార్డెన్లు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కాలేజీలో జరిగిన చిన్న గొడవలకు విద్యార్థులు ఆత్మహత్యకు ప్రయత్నిస్తుంటే.. బాధిత కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. జమ్మలమడుగు పట్టణంలోని నాగులకట్ట ఎస్సీ కాలేజీ విద్యార్థులకు వసతి గృహం ఏర్పాటు చేశారు. పట్టణంలోని ప్రైవేట్ కాలేజీల్లో చదువుకుంటూ వసతి గృహాలకు వెళ్తున్నారు. రెండు రోజుల క్రితం పట్టణంలోని ఓ కాలేజీకి చెందిన చంద్ర హరిత, నందిని బయటి విషయాలను తీసుకుని వచ్చి.. వసతి గృహంలో ఉన్న బాత్‌రూంలను శుభ్రపరిచే యాసిడ్ తాగి ఆత్మహత్యకు ప్రయత్నించారు. అయితే విద్యార్థినుల మధ్య మనస్పర్థలే ఇందుకు కారణమైనట్లు తెలుస్తోంది. ఈ ఇద్దరు విద్యార్థినులపై ఓ విద్యార్థిని బయటి వారికి లేనిపోని ప్రేమ వ్యవహారాలు నడుపుతున్నాంటూ ప్రచారం చేయడంతో.. ఆత్మహత్య చేసుకున్నారా లేదా మరేమైనా విషయాలు ఉన్నాయా అనేది ప్రచారంలో ఉంది. యాసిడ్ తాగిన విద్యార్థినులు ప్రస్తుతం ఒకరు కడప రిమ్స్, మరొకరు కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

పరామర్శించిన దళిత నాయకులు

నాగులకట్ట వద్ద ఉన్న ఎస్సీ వసతి గృహంలోని విద్యార్థినులను ఎస్సీ మహిళా నాయకురాలు అరుణ కుమారితోపాటు మాదిగ దండోర నాయకుడు నరసింహులు పరామర్శించారు. పిల్లలు చదువులపై దృష్టి పెట్టాలే తప్ప క్షణికావేశంలో ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం వల్ల తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతారన్న విషయాన్ని వారు తెలిపారు. అలాగే వార్డెన్ కూడా విద్యార్థినులపై పర్యవేక్షణ ఉండాలన్నారు.

బాలలే సమాజానికి భవిష్యత్తు



బాలోత్సవంలో పాల్గొన్న విద్యార్థులతో అతిథులు

కడప కల్చరల్ : బాలల శ్రేయస్సుపైనే భావి సమాజం, భవిష్యత్తు ఆధారపడి ఉందని బాలోత్సవ్ కమిటీ అధ్యక్షులు జి.గోపాల్ అన్నారు. ఈనెల 14న బాలల దినోత్సవం పురస్కరించుకొని కడప బాలోత్సవ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులకు భాష నైపుణ్యాలను పెంపొందించడానికి ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. శనివారం స్థానిక ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ పోటీలు నిర్వహించారు. 7 8 తరగతుల విద్యార్థులకు ట్రాఫిక్ సమస్యలు- పరిష్కారాలు అనే అంశంపై వ్యాసరచన పోటీ.. వేమన, సుమతీ శతకాలలోని పద్యాలాపన నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు 180 మంది వ్యాసరచనలో పాల్గొనగా, 225 మంది పద్యాలాపనలో పాల్గొన్నారు. 9, 10 తరగతుల విద్యార్థులకు మత్తు పదార్థాలు- యువతపై ప్రభావం- వాటి నివారణ అంశంపై వ్యాసరచన పోటీ, రంగ స్థల పద్యాలపై పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో బాలోత్సవం ఉపాధ్యక్షులు ఉండేల నాగమునిరెడ్డి, బాల ఎల్లారెడ్డి, వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ వీర సుదర్శన్‌రెడ్డి, ఉపాధ్యాయ సంఘం నాయకులు లక్ష్మీరాజా, షామీర్, సుందరయ్య, వెంకటసుబ్బయ్య, దేవదత్తం, వెంకటేశ్వర్లు, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరరావు, పాదిలి నాగరాజు, డాక్టర్ రెడ్డిశేఖర్‌రెడ్డి, డాక్టర్ స్వతంత్ర్య బాబు, భూమిరెడ్డి స్వరూపరాణి పాల్గొన్నారు. మోపూరి భైరవేశ్వర్, సందీప్, పరిమళ జ్యోతి, రామచంద్రయ్యలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. జన విజ్ఞాన వేదిక నాయకులు శివరాం, సునీత, అరుణ, శ్రీనివాసులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలు ప్రారంభం



రగ్బీ ఆడుతున్న క్రీడాకారిణులు



క్రీడా పోటీలకు హాజరైన వివిధ జిల్లాల విద్యార్థినులు

కమలాపురం : స్థానిక సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాలలో 68వ రాష్ట్ర స్థాయి బాలబాలికల అండర్-14 రగ్బీ స్కూల్ గేమ్స్ క్రీడా పోటీలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డితో కలిసి ప్రారంభించారు. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల నుంచి క్రీడాకారులు వచ్చారు. ఈ పోటీలు మూడు రోజుల పాటు జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో వైవీయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ రామసుబ్బారెడ్డి, రగ్బీ క్రీడల నిర్వాహకులు అరుణ కుమారి, తిరుపాల్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, కరస్పాండెంట్ రాజగోపాల్‌రెడ్డి, బీసీసీపీఎల్ హెచ్‌ఆర్ మేనేజర్ భార్గవ్‌రెడ్డి, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి, ఎంఈఓ సుభాషిణి, మస్తానయ్య, అధ్యాపకులు, విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ అశోక్

కడప కోటిరెడ్డి సర్కిల్ : కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న అశోక్ ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కొంత కాలంగా విధుల పేరుతో తనను వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ శుక్రవారం ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్‌లో విష ద్రావణం తాగి ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. అతను టీడీపీ దగ్గరికి మోటార్ సైకిల్‌పై వెళ్లాడు. అక్కడ గమనించిన కొందరు అతన్ని ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. పోలీసులు విచారణ చేపట్టారు. కానిస్టేబుల్ విలేకరులతో మాట్లాడుతూ తనను చిన్న చౌక్ పోలీస్ స్టేషన్‌లో విధుల పేరుతో పోలీసులు వేధిస్తున్నారని తెలియజేశారు. అయితే ఈ సంఘటనపై సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఎలాంటి కేసు నమోదు కాలేదు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

కమనీయం..
కడప రాయుని కల్యాణం



కల్యాణ దర్శనం చేయిస్తున్న అర్చకులు



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

కడప కల్చరల్ : తిరుమలకు తొలిగడపగా భావించే కడప నగరంలోని దేవునికడప శ్రీ లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని కమనీయంగా నిర్వహించారు. ఇందులో భాగంగా దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలకు విశేష అభిషేకాలు నిర్వహించి వధూవరులుగా అలంకరించి కల్యాణ వేదికపైగల ప్రత్యేక పీఠాలపై కొలువు దీర్చారు. అనంతరం ప్రధాన అర్చకులు కృష్ణమోహన్, త్రివిక్రమ్‌ల ఆధ్వర్యంలో కల్యాణ క్రతువును క్రమంగా నిర్వహించారు. అమ్మవారి మంగళసూత్రాలను భక్తులకు దర్శింపజేసి వారే స్వామి పక్షాన శ్రీదేవి, భూదేవి మాతల గళసీమల్లో అలంకరించారు. కల్యాణం అనంతరం లాజహోమం నిర్వహించారు. ఉభయదారులతో ప్రత్యేక పూజలు నిర్వహింపజేశారు. సాయంత్రం కల్యాణమూర్తులను ప్రత్యేక పల్లకీపై కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగించారు. సాక్షాత్తు వైకుంఠ వాసుడే అమ్మవార్లతో కలిసి తమ ఇంటి ముంగిటికి రావడంతో.. భక్తులు పులకించి పూజాద్రవ్యాలు సమర్పించి పూజలు నిర్వహించారు. కార్తీక మాసంలో వచ్చిన శ్రవణా నక్షత్రం గనుక భక్తులు పెద్ద సంఖ్యలో కార్యక్రమానికి హాజరయ్యారు. అర్చకులు మంగళ హారతులు, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వెండి పాత్రల బహూకరణ



వెండి గిన్నెలను అందజేస్తున్న భక్తులు

కడప కల్చరల్ : తిరుమల-తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలోని దేవునికడప శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామికి శనివారం భక్తులు వెండి పాత్రలను ప్రదానం చేశారు. చెన్నైకి చెందిన జె.ప్రసన్న వెంకటేశ్వర రావు మొక్కు తీర్చుకోవడంలో భాగంగా ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డికి రూ.94,280 విలువల గల కిలో 40 గ్రాముల మూడు వెండి పాత్రలను ఉద్ధరిణిలతో సహా అందజేశారు. దాతలను ఇన్‌స్పెక్టర్ సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఉర్దూ భాష అభివృద్ధి అందరి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవిరెడ్డి

కడప ఎడ్యుకేషన్ : ఉర్దూ భాష అభివృద్ధి అందరి బాధ్యత అని, ఉర్దూను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి పేర్కొన్నారు. శనివారం అంజుమన్ తరఖీ ఉర్దూ ఆధ్వర్యంలో కడప నగరంలోని ఎస్‌కేఆర్ - ఎస్‌కేఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ ఉర్దూ సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌కు చైర్మన్ సత్తార్ ఫైజి అధ్యక్షత వహించగా కన్వీనర్‌గా సయ్యద్ హిదాయతుల్లా వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి, జాతీయ ఉర్దూ సెమినార్ చీఫ్ ప్యాటర్న్ అమీర్ బాబు, మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవిరెడ్డి మాట్లాడుతూ ఉర్దూ పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలన్నారు. ఉర్దూ అంగన్వాడీ కేంద్రాలు వెంటనే స్థాపించితే మరింతగా ఉర్దూ భాష అభివృద్ధి చెందుతుందన్నారు. ఉర్దూ విద్యార్థులకు పాఠ్య పుస్తకాల కొరత ఉందని తెలిసిందని, సొంత ఖర్చులతో ముద్రించి ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ ఉర్దూ స్పెషల్ డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ సలీం బాషా, ఉర్దూ డిపార్ట్‌మెంట్ అధ్యపకురాలు షాజియా బేగం, విద్యార్థులు పలు సమస్యలపై ఎమ్మెల్యే మాధవిరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం వక్తలందరూ కలిసి పలు పుస్తకాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఫాతిమా మెడికల్ కళాశాల కరస్పాండెంట్ జవ్వాద్, సంఘ సేవకులు సయ్యద్ సలాహుద్దిన్, అంజుమన్ సభ్యులు సయ్యద్ రహమతుల్లా నజీర్ బాషా, పర్వేజ్, యూనుస్, వాహిద్, మక్బూల్, ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షులు ఇలియాస్ బాషా, రాష్ట్ర నాయకులు బాలగంగిరెడ్డి, పలువురు అధ్యాపకులు, ఉర్దూ భాషాభిమానులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.